




RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు — జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

సంపుటి : 01 | సంచిక : 308 | హైదరాబాద్ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | బుధవారం 08-05- 2024 | పేజీలు : 4 | వెల : రూ. 5/-




## ప్రజాస్వామ్యంలో ఓటుకు విశేష ప్రాధాన్యం

## ప్రధాని మోదీ

**అహ్మదాబాద్, ప్రభాత సూర్యుడు:** ప్రజాస్వామ్యంలో ఓటుకు విశేష ప్రాధాన్యం ఉందని ప్రధాని మోదీ అన్నారు. దేశ ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కొత్త రికార్డు సృష్టించాలని చెప్పారు. అందరి భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం మరింత పటిష్ఠమవుతుందని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల మూడో విడుత పోలింగ్ సందర్భంగా గాంధీనగర్ లోక్‌సభ పరిధిలోని అహ్మదాబాద్‌లో ఉన్న నిషాన్ హైస్కూల్‌లో ప్రధాని మోదీ తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఎండల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని చెప్పారు. ఎన్నికల వేళ ప్రజలు తమ ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని సూచించారు. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగితే ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. సమయంతో పోటీపడుతూ మీడియా మిత్రులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారన్నారు. గాంధీనగర్ నుంచి బరిలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిషా కూడా ప్రధాని మోదీతోపాటు పోలింగ్ బూత్ వద్దకు వచ్చారు. పోలింగ్ కేంద్రం పరిసరాల్లోకి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలను ప్రధాని పలుకరించారు. ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దుచేశారు.

## రైతులపాలిటి శాపం కాంగ్రెస్..

### కామారెడ్డి, మెదక్ బస్సుయాత్రలో కేసీఆర్



**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు:** రైతుబంధుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర చేసిండని, రాష్ట్రంలో ఇక రైతుబంధు కథ వొడ్సినట్టేనని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో డబ్బులు వేస్తామని చెప్పి మళ్లీ ఆయనే ఎన్నికల కమిషన్‌కు చెప్పి బ్యాన్ చేయించిండని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. బస్సుయాత్రల్లో భాగంగా కామారెడ్డి, మెదక్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తారీఖు లోపల రైతుబంధు వేస్తామని ముఖ్యమంత్రి చెప్పాడని, మరి అందరికీ వచ్చిందా? అని ప్రశ్నించగా రాలేదని ప్రజలు సమాధానం చెప్పారు. స్పందించిన కేసీఆర్ 'ఇక రైతుబంధు రాదు. ముఖ్యమంత్రే కుట్రచేసి ఎలక్షన్ కమిషన్‌కు తెలియజేసి, దాన్ని మళ్లీ ఆయనే బ్యాన్ చేసిండు. అందుకే రైతుబంధు రాదు. దాని కథ ఒడ్సిపోయింది' అని పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత మిగతా రైతులకు వేస్తామని చెప్తున్నారని, వారు ఏం తప్పు చేశారని, రైతుబంధును ఎందుకు ముంచుతుండ్రని ప్రశ్నించారు. తాము రూ. 15 వేలు వేస్తామని చెప్పి ఇప్పుడు పాత రైతుబంధు కూడా ఇవ్వడం లేదు.

## తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన కెసిఆర్



**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు:** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టేశారని, ఐదేళ్ల వరకు కెసిఆర్ రుణమాఫీ చేయకపోవడంతో రైతులపై రెండింతల భారం పడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

### ఓటీవీ ఛానల్ ఇంటర్వ్యూలో రేవంత్ స్పష్టీకరణ

## గాలివాన బీభత్సం..

### నేల కూలిన చెట్లు.. విరిగిన విద్యుత్తు స్తంభాలు

**హైదరాబాద్, ప్రభాత సూర్యుడు:** రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో అన్నదాతకు అపారనష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, నింపిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. పండ్లు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. ఈదురుగాలులకు పలుచోట్ల ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. విద్యుత్తు స్తంభాలు, భారీ వృక్షాలు నేలకూలాయి. పలుచోట్ల పిడుగులు పడటంతో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి.




## సిఎం కేజ్రీవాల్ బెయిల్ విచారణ వాయిదా

### వచ్చే వారం నిర్ణయిస్తామని సుప్రీం వెల్లడి

**న్యూఢిల్లీ, ప్రభాత సూర్యుడు:** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మంగళవారం సుప్రీంకోర్టు ఉపశమనం లభించలేదు. మధ్యంతర బెయిల్ కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను వచ్చే గురువారం కాని వచ్చే వారం కాని ముగిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. కాగా..పిటిషన్ విచారణ సందర్భంగా కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చిన పక్షంలో ఆయన అధికారికి ఫైళ్లపై ఎటువంటి సంతకాలు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2022 గోవా ఎన్నికల సందర్భంగా కేజ్రీవాల్ ఒక సెవన్ స్టార్ హోటల్‌లో బసచేశారని, ఆయన బిల్లులో కొంత భాగాన్ని ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన సాధారణ పరిపాలన శాఖ భరించిందని ఇడి తెలియచేసింది.బెయిల్‌పై విడుదలైన తర్వాత కేజ్రీవాల్ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన ఫైళ్లను చూడరని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించగా ఆయన అధికారిక బాధ్యతలేవీ చూడకూడదని తాము చెబుతున్నామని కోర్టు స్పష్టం చేసింది. అప్రూవర్ల వాంగ్మూలాలను ఇడి తొక్కిపెట్టిందంటూ కేజ్రీవాల్ చేసిన వాదనను ఇడి తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు తోసిపుచ్చుతూ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనంకు ఒక నోట్ అందచేశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆప్ అధినేత అయిన కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే విషయాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం ఇదివరకు సూచించింది. అయితే ఈ సూచనను ఇడి నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఇది ప్రజలలో తప్పుడు సంకేతాలు పంపుతుందని ఇడి తెలిపింది. ఆయన ఢిల్లీ ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి. ఎన్నికలు ఉన్నాయి. ఇవి అసాధారణ పరిస్థితులు. ఆయన స్వాభావికంగా నేరస్థుడు కారు అని ధర్మాసనం తెలిపింది. బెయిల్‌పై విడుదల చేస్తే ఆయనను ముఖ్యమంత్రి విధులను నిర్వహించడానికి అనుమతించబోమని, ఆయన అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయరాదని ధర్మాసనం తెలిపింది. కాగా..మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసిన పక్షంలో కేజ్రీవాల్ రాజకీయ కార్యకలాపాలపై ఆంక్షలు విధించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఆయన తరపు సీనియర్ న్యాయవాది ఎఎం సింఘ్వీ తెలిపారు. అయితే కేజ్రీవాల్‌కు మధ్యంతర బిల్లు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఇడి తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదరనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు తెలిపారు.


